
జలమయమైన చేర్యాలలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఆవరణ


హుస్నాబాద్ మార్కెట్‌లో తడిసిన ధాన్యం


సిద్దిపేటలో వర్షంలో తడుచుకుంటూ వెళ్తున్న యువతులు


భారీ వర్షాలకు నేలకొరిగిన వరిపంట


హుస్నాబాద్ మార్కెట్‌లో నీటిలో ధాన్యం కుప్పలు

వణికిస్తున్న మొంథా

- పొద్దంతా కమ్మేసిన మేఘాలు, జిల్లా అంతటా భారీ వర్షం
- రెడ్ అలర్ట్ జారీ

- పలు మార్కెట్ యార్డుల్లో తడిసిన ధాన్యం
- నీటమునిగిన పంట చేలు..
- కొన్నిచోట్ల నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- నేడు జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు
- గరిష్ఠంగా 268.8 మీ.మీ వర్షపాతం నమోదు

సిద్దిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావం కారణంగా జిల్లావ్యాప్తంగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి జిల్లా తడిసిముద్దయింది. బుధవారం ఉదయం నుంచే మేఘాలు కమ్ముకోగా చిరుజల్లులుగా ప్రారంభమై నిమిషం పాటు ఆగకుండా ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. జిల్లాలోని పలు మార్కెట్ యార్డులు, ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం, రోడ్డుపై ఆరబోసిన ధాన్యం నీటి పాలైంది. మార్కెట్‌యార్డుల్లో, ఐకేపీ కేంద్రాల్లోకి రైతులు తెచ్చిన పంట నీట మునగకుండా ఉండేందుకు నానా తంటాలు పడుతూ టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచారు. జిల్లాలో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. రాత్రి ఎనిమిది గంటల వరకు కురిసిన భారీ వర్షం వల్ల జిల్లాలోని హుస్నాబాద్‌లో గరిష్ఠంగా 268.8 మి.మీ, అక్కన్నపేటలో 260.8 మి.మీ వర్షపాతం

మిగతా 8వ పేజీలో


హుస్నాబాద్‌లోని జలమయమైన రహదారిలో వెళ్తున్న మహిళలు - హుస్నాబాద్ (ఆంధ్రజ్యోతి)


సిద్దిపేట పట్టణంలోని మార్కెట్‌యార్డులో వర్షానికి కొట్టుకుపోతున్న ధాన్యం

వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీలో)
1. హుస్నాబాద్	268.8
2. అక్కన్నపేట	260.8
3. మద్దూరు	203.3
4. నంగునూరు	194.5
5. ధూళిమిట్ట	185.8
6. చేర్యాల	172.0
7. కోహెడ	166.3
8. చిన్నకోడూర్	179.0
9. సిద్దిపేట రూరల్	141.8
10.నారాయణరావుపేట	123.0
11. కొమురవెల్లి	122.0
12. సిద్దిపేట అర్బన్	121.3
13. కొండపాక	113.0
14. బెజ్జంకి	110.0
15. కుకునూర్‌పల్లి	91.0
16. జగదేవ్‌పూర్	87.8
17. తొగుట	61.8
18. మర్కుక్	55.0
19. వర్గల్	41.5
20. ములుగు	38.3



రైతులు నష్టపోకుండా
చర్యలు చేపట్టాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ : భారీ వర్షాలకు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. రైతులకు నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యం నిల్వలతో పాటు ఆయా ప్రాంతాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడవకుండా రైతులకు టార్పాలిన్ కవర్లు ఇవ్వాలన్నారు. కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం పంపిన వెంటనే దిగుమతి చేసుకోవాలని ఆయన సూచించారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

మొంథా తుపాను ప్రభావంతో జిల్లావ్యాప్తంగా మరో రెండు రోజుల పాటు మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈ మేరకు గురువారం సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా అన్నీ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, రెసిడెన్షియల్, పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు మూసివేయాలని బుధవారం రాత్రి జిల్లా కలెక్టర్ హైమావతి ప్రకటనలో పేర్కొన్నారు. ఆదేశాలను ఎవరైనా పాటించకుండా విద్యాసంస్థలు తెరిచి ఉంచితే కఠిన చర్యలుంటాయని ఆమె హెచ్చరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 11మందికి
రూ.లక్షా 10వేల జరిమానా

గజ్వేల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 11 మందికి రూ.లక్షా 10వేల జరిమానా విధిస్తూ గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. గజ్వేల్‌లోని పలు చౌరస్తాల్లో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో పదకొండు మంది మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. బుధవారం వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి 11 మందికి రూ.లక్షా 10వేల జరిమానా విధిస్తూ తీర్పును ఇచ్చారని సీఐ తెలిపారు. ఇకపై డ్రంకన్ డ్రైవ్‌లో తీవ్ర శిక్షలు ఉంటాయని, ప్రజలు గమనించి మద్యం సేవించి ఎట్టి పరిస్థితిలో వాహనాన్ని నడపకూడదని హెచ్చరించారు.

కోడ్ ముగిసినా.. ముసుగు తీయరా


శేరిపల్లి బందారంలో ఇందిరాగాంధీ విగ్రహానికి తొలగించని ముసుగు

దౌల్తాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ముగిసి 20 రోజులు గడుస్తున్నా రాజకీయ నాయకుల విగ్రహాలు, అభివృద్ధి పనుల శిలాఫలకాలపై వేసిన ముసుగులను అధికారులు ఇంతవరకు తొలగించలేదు. అక్టోబరు 9న బీసీలకు 42 శాతం రిజర్వేషన్, జీవో నెంబర్ 9 చెల్లదని పేర్కొంటూ స్థానిక ఎన్నికలపై కోర్టు స్టే విధించింది. అదే రోజు నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల కోడ్‌ను ఎత్తివేసింది. అయినప్పటికీ, దౌల్తాబాద్ మండల పరిధిలోని శేరిపల్లి బందారం ప్రధాన రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహానికి, అభివృద్ధి పనుల శిలాఫలకానికి వేసిన ముసుగులను అధికారులు ఇప్పటికీ తొలగించకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


విజయదుర్గామాతకు స్వర్ణ కిరీటాన్ని సమర్పిస్తున్న కంచి కామకోటి పీఠాధిపతి

విజయదుర్గా అమ్మవారికి
స్వర్ణ కిరీటం సమర్పణ

కొండపాక, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మర్పడగ క్షేత్రంలోని విజయదుర్గా మాతకు కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి, రాంపూర్ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామితో కలిసి స్వర్ణ కిరీట సమర్పణ కార్యక్రమాన్ని బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు అనంతరం అమ్మవారికి, క్షేత్రంలోని మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శంకర విజయేంద్ర సరస్వతి స్వామికి క్షేత్ర నిర్వాహకులు హరినాథ శర్మ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో కలెక్టర్ హైమావతి, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ,వర్గల్ సరస్వతీ దేవాలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి ఘన స్వాగతం పలికారు. ఇక భారీ వర్షం కురుస్తున్నప్పటికీ విజయదుర్గామాత స్వర్ణ కిరీటం సమర్పణ కార్యక్రమంలో భక్తులు భారీగా తరలివచ్చారు.

రెవెన్యూ లీలలు

- పొతికి రూ.10వేలు
- పంచనామాకి రూ.500
- కుకునూరుపల్లి ఎమ్మార్వో కార్యాలయంపై అవినీతి ఆరోపణలు

కుకునూరుపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి ఎమ్మార్వో కార్యాలయం అవినీతికి అడ్డాగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. "ప్రతి పనికీ ఒక రేటు" అంటూ అధికారులు పౌతి (వారసత్వ రిజిస్ట్రేషన్), పంచనామా, మ్యూటేషన్ వంటి పనుల కోసం డబ్బు డిమాండ్ చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల సమస్యలు, భూమి తరలింపులో నిర్లక్ష్యం, ఆర్ఐపై ఆరోపణలతో కార్యాలయం తీరు ప్రజా వ్యతిరేకంగా మారింది.

అవినీతికి అడ్డా..

కుకునూరుపల్లి మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్ఓ) కార్యాలయం అవినీతికి నిలయంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తల్లిదండ్రులు చనిపోతే, వారి వారసులు భూమిని తమ పేరున పౌతి (వారసత్వ రిజిస్ట్రేషన్) చేసుకోవడానికి రూ. 10వేలు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. తమ భూమిని తమ భార్య పేరున పౌతికి దరఖాస్తు చేసుకున్న వ్యక్తిని కూడా రూ. 10వేలు అడగడంతో, బాధితుడు నిలదీయగా అధికారి వెనక్కి తగ్గి సంతకం చేసినట్లు సమాచారం. భూ పంచనామా నిర్వహించడానికి రూ. 500 నుంచి రూ.2వేల వరకు తీసుకుంటున్నారని వార్తలు వినిపిస్తున్నాయి.

ప్రతి పనికీ ఒక రేటు

ఎమ్మార్వో కార్యాలయంలో పని జరగాలంటే సేల్ డీడ్, పౌతి, మ్యుటేషన్, ఈడబ్ల్యూఎస్, ఫ్యామిలీ సర్టిఫికెట్లు వంటి ప్రతి పనికీ ఒక రేటు కట్టారని ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు లేనిదే ఏ పనీ జరగట్లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కుకునూరుపల్లి తహసీల్దార్ కార్యాలయం

భూ రికార్డు కోసం దరఖాస్తు చేసుకున్న ఓ వ్యక్తిని ఒక అధికారి రూ. 5 వేలు డిమాండ్ చేయడం, నిరాకరించడంతో రెండు రోజులు దరఖాస్తును ఆలస్యం చేశారు. "ఎనిమిదేళ్లుగా రైతు బంధు తీసుకుంటున్నావు కదా, నాకు ఐదు వేలు ఇవ్వలేవా" అంటూ ఆగ్రహం వ్యక్తం చేయడంతో, బాధితుడు రూ. 5వేలు చెల్లించుకోవాల్సి వచ్చింది. అలాగే, ఒక ప్లాటు నాలా కన్వెన్షన్‌కి రూ. 3వేలు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.

ఆర్ఐపై తీవ్ర ఆరోపణలు

మూడేళ్లకు పైగా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ సత్యనారాయణపై అవినీతి ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్, ఫ్యామిలీ సర్టిఫికెట్ల జారీ విషయంలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆర్టీఐ ద్వారా వివరాలు కోరగా, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు డబ్బున్న, పలుకుబడి ఉన్నవారికి మంజూరైనట్లు తేలింది. ఈ కారణంగా ఆ సర్టిఫికెట్ల జారీని రద్దు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారం వెనుక మండలంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ పెద్ద నాయకుడు ఉన్నట్లు కూడా తెలుస్తోంది. ఆర్ఐపై వచ్చిన ఆరోపణలపై కలెక్టర్ కార్యాలయం వివరణ కోరినట్లు సమాచారం.

చెరువులు, మట్టి తరలింపులో నిర్లక్ష్యం

సంవత్సర కాలంగా ఆక్రమణలకు గురవుతున్న చెరువులు, మల్లన్నసాగర్ నుండి కొండపోచమ్మ సాగర్‌కు వెళ్తున్న కాల్వ మట్టి అక్రమ తరలింపు విషయంలోనూ అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు. చెరువుల కబ్జా గురించి

మిగతా 8వ పేజీలో

ఆర్ఎంపీ క్లినిక్‌లో
వైద్యాధికారుల
తనిఖీలు

చేర్యాల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం నాగపురి గ్రామంలో ఓ ఆర్ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌లో వైద్యాధికారుల బృందం బుధవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించింది. కుకునూరుపల్లి మండలానికి చెందిన జనార్దన్ కొన్నాళ్ల క్రితం నాగపురిలో క్లినిక్ ఏర్పాటు చేసి ఇక్కడే స్థిరపడ్డాడు. మిత్ర హాస్పిటల్ బోర్డు పెట్టి వైద్యసేవలు అందిస్తున్నాడు. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం గ్రామంలో జరిగిన పలు పరిణామాల నేపథ్యంలో అతడిపై ఆరోపణలు వెల్లువెత్తడంతో వైద్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులందాయి. దీంతో వైద్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశానుసారం చేర్యాల, మద్దూరు మండలాల పీహెచ్‌సీ వైద్యాధికారులతో పాటు కొమురవెల్లి పోలీసు సిబ్బంది ఆకస్మికంగా క్లినిక్‌ను తనిఖీ చేశారు. ఆ సమయంలో జనార్దన్ అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులకు తెలిపి మందులు, ఇతరత్రా వాటిని స్వాధీనం చేసుకున్నారు.

ఔట్‌సోర్సింగ్ అక్రమాలకు
ఆధార్‌తో చెక్
- ఉద్యోగుల ఆధార్ అనుసంధానానికి చర్యలు
- ఆధార్ ఇవ్వనివారికి ఈ నెల జీతాలు బంద్ 7



అర్బన్ పార్కుకు
హైటెక్ హంగులు
- నర్సాపూర్ ఫారెస్ట్‌లో ఏర్పాటు
- నీటి మధ్యలో 40 కాటేజీల నిర్మాణం 7

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా గరిమా

- వీడ్కోలు పలికిన కలెక్టర్ హైమావతి, సిబ్బంది

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేసిన గరిమా అగర్వాల్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈసందర్భంగా కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ హైమావతి.. గరిమ అగర్వాల్‌ను శాలువా, చీరతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాను కలెక్టర్‌గా రాకముందే గరిమ అగర్వాల్ పరిపాలనా దక్షత గురించి విన్నానన్నారు. తాను పనిచేసిన ఈ కొద్దికాలంలో ఆమె పరిపాలనలో ఎంతో తోడ్పాటు అందించారని కొనియాడారు. ఇందిరమ్మ ఇండ్లు, వన మహోత్సవం, మంత్రుల పర్యటనలు, స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు సహా పలు ప్రభుత్వ కార్యక్రమాలలో ఆమె సమర్థవంతంగా పనిచేశారని చెప్పారు.అనంతరం గరిమ అగర్వాల్ మాట్లాడుతూ, వృత్తిపరంగా, వ్యక్తిగతంగా జిల్లాతో తనకు మర్చిపోలేని అనుబంధం ఉందని తెలిపారు. దుబ్బాక రిటర్నింగ్ అధికారిగా అసెంబ్లీ ఎన్నికలు, ఋతుప్రేమ, స్టీల్ బ్యాంక్, ప్రజా పాలన, ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ గ్యారంటీ పథకాల అమలు, హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు అభివృద్ధి వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు, కలెక్టర్లు ప్రశాంత్ పాటిల్, మనుచౌదరి, హైమావతి మార్గదర్శకత్వంలో పనిచేయడం పరిపాలనలో మంచి అనుభవాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు.


గరిమా అగర్వాల్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ హైమావతి, అధికారులు

ఎడిట్ ఆప్షన్ కోసం
రైతుల ఎదురుచూపులు

గజ్వేల్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): క్రాప్ బుకింగ్‌లో ఎడిట్ ఆప్షన్ కోసం జిల్లా రైతులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) నిర్వహించిన క్రాప్ బుకింగ్‌లో తప్పిదాలు జరగడంతో మొక్కజొన్న సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 28వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారు. బహిరంగ మార్కెట్‌లో మొక్కజొన్నల ధర అకస్మాత్తుగా పడిపోవడంతో ప్రభుత్వం మార్క్‌ఫెడ్, పాక్స్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో మొక్కజొన్నలు విక్రయించేందుకు కేంద్రాలకు వెళ్లిన రైతుల వివరాల్లో, వారి పొలంలో వరి లేదా పత్తి సాగు చేసినట్లుగా క్రాప్ బుకింగ్‌లో నమోదు కావడంతో పంటలను విక్రయించే అవకాశం లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వం క్రాప్ బుకింగ్‌లో ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణిని వివరణ కోరగా దౌల్తాబాద్, గజ్వేల్ మండలాల నుంచి క్రాప్ బుకింగ్‌లో ఎడిట్ ఆప్షన్ విషయం తమ దృష్టికి వచ్చిందని, ఉన్నతాధికారులతో మాట్లాడి ఆప్షన్ ఇపిస్తామని తెలిపారు.

కారం, ఆయిల్ తగ్గించండి

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్
- జ్యోతిబాపులే గురుకులం తనిఖీ, మధ్యాహ్న భోజనం పరిశీలన
- తూప్రాన్‌లో సుడిగాలి పర్యటన



తూప్రాన్ గురుకులంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

తూప్రాన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో కారం, ఆయిల్ (నూనె) తగ్గిస్తూ వంటకాలు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ వంట మనిషికి సూచించారు. నాన్ వెజ్ వంటకాల్లో కారం ఎక్కువగా ఉండటంతో కలెక్టర్ కొంత అసౌకర్యానికి గురయ్యారు. బుధవారం తూప్రాన్ మండలంలో సుడిగాలి పర్యటన చేపట్టిన కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్డీఓ జయచంద్రారెడ్డితో కలిసి రావెల్లి శివారులోని మహాత్మా జ్యోతిబా పులే గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించారు. వంట గది, వంట సరకులు, వండిన భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ డివిజన్ కార్యాలయాల సముదాయంలోని భవన నాణ్యతను, నమూనాను పరిశీలించారు. భవనంలో వర్షపు నీరు రావడంపై ఇంజనీర్‌ను ప్రశ్నించారు. తూప్రాన్ పట్టణానికి మంజూరైన అర్బన్ పీహెచ్‌సీ ఏర్పాటుకు పుట్టకోటలోని ఎస్సీ హాస్టల్ భవనాన్ని పరిశీలించి, భవన నిర్మాణానికి స్థలం, విధానం గురించి ఆరా తీశారు. తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీఓ, సర్వే అధికారులతో ట్రిపుర్ ఆర్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఒక సర్వే నంబర్ వ్యత్యాసంపై కమిటీ వేసి పరిశీలన చేయాలని సూచించారు. తూప్రాన్ మండలంలో 8 గ్రామాల్లో భూసేకరణ చేస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. అందులో 17 అవార్డులు(విడుతల్లో) పంపించగా, 13 అవార్డులను ఆమోదించినట్లు వివరించారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో శాలికా తదితరులు పాల్గొన్నారు.



కొమురవెల్లి మల్లన్న ఆలయ మహమండపంలో దీపారాధన చేస్తున్న అర్చకులు,మహిళలు

ఆలయాల్లో కార్తీక దీపోత్సవం

కొమురవెల్లి/వర్గల్ అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం పవిత్ర కార్తీకమాస దీపోత్సవం నిర్వహించారు. కార్తీక శుద్ధ అష్టమిని పురస్కరించుకొని ఆలయ మహమండపంలో 8వ రోజు గణేష అధర్వణ శీర్ష పారాయణం, లలితా సహస్ర నామ పారాయణం గావించి దీపోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు ఆలయాధికారులు, అర్చకులు దీపపు ప్రమిదలు, పూజాసామగ్రిని అందించారు. కార్యక్రమంలో ఈవో టంకశాల వెంకటేష్, ఆలయాధికారులు, అర్చకులు,తదితరులు పాల్గొన్నారు. నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో దీపారాధన నిర్వహించారు. ఆలయ మండపంలో భక్తులు వివిధ ఆకృతుల్లో దీపాలను వెలిగించారు. ఆలయ ధర్మకర్తల మండల చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్త, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామరాజు పర్యవేక్షణలో కార్తీక మాసోత్సవాలు జరుగుతున్నాయి.



నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో..

రూ.లక్ష కోట్లతో గ్రామీణ బ్యాంకుల కార్యకలాపాల విస్తరణ

- లబ్ధిదారులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- తెలంగాణ గ్రామీణాభివృద్ధి బ్యాంకుల చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



లబ్ధిదారులకు చెరుకు కోత యంత్రాలను అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

జహీరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 2028 మార్చి 31నాటికి రూ.లక్ష కోట్లతో తెలంగాణ మంజీర గ్రామీణ బ్యాంకుల్లో కార్యకలాపాలను విస్తరించనున్నట్లు తెలంగాణ గ్రామీణాభివృద్ధి బ్యాంకుల చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం జహీరాబాద్‌లోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ మంజీర గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రూ.6 కోట్ల వ్యయంతో 6 మంది రైతులకు చెరుకు కోత యంత్రాలను, మహిళా సంఘాల సభ్యులకు మరో రూ.6 కోట్ల రుణాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణవ్యాప్తంగా రూ.77 వేల కోట్లతో 934 తెలంగాణ మంజీరా గ్రామీణ బ్యాంకులు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. త్వరలో మరో 25 బ్యాంకుల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. నాబార్డు డీడీఎం కృష్ణమూర్తి, ఉమ్మడి మెదక్ జిల్లా రీజినల్ మేనేజర్ సమత, వ్యవసాయ శాఖ ఏడీఏ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

- తృటిలో తప్పిన ప్రమాదం

నారాయణఖేడ్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓవర్ లోడ్‌తో వస్తున్న లారీ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. అయితే, ఆ సమయంలో అక్కడ ప్రజలు, వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే, మంగళవారం రాత్రి కంగ్టి వైపు నుంచి ఖేడ్ వైపు వస్తున్న ఓ లారీ మున్సిపల్ పరిధిలోని నెహ్రూనగర్ హనుమాన్ ఆలయ సమీపంలో అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొంది. దీంతో భారీ శబ్దంతో విద్యుత్ తీగలు తెగిపడటంతో జనాలు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన తర్వాత గంటన్నర పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో సిబ్బంది వెంటనే మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

గుంతను తప్పించబోయి..

- ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం



ఖమ్మంపల్లి రోడ్డులో అదుపు తప్పి రోడ్డు పక్కకు వెళ్లిన ఆర్టీసీ బస్సు

మునిపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఖమ్మంపల్లి రోడ్డులో గుంతను తప్పించబోయి, రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దిగిపోయింది. అయితే, డ్రైవర్ అప్రమత్తమై బ్రేక్ కొట్టి ఆపడంతో పెను ప్రమాదం తప్పింది, ప్రయాణికులు, విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. సదాశివపేట నుంచి బోడపల్లికి రోజు మాదిరిగానే బుధవారం ఉదయం ఈ బస్సు చిన్నచెల్మెడ, ఖమ్మంపల్లి గ్రామాల మీదుగా వస్తుండగా ఈ ఘటన జరిగింది. ప్రయాణికులు ఇతర వాహనాల్లో గమ్యస్థానాలకు చేరుకోగా, బస్‌పాస్‌లు ఉన్న విద్యార్థులు చేసేదేమీ లేక మునిపల్లి మోడల్ స్కూల్, కళాశాలకు నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చింది.

అప్పుడు మక్తక్యాసారం రోడ్డులో..

గతంలో జులై 30న తాటిపల్లి నుంచి మక్తక్యాసారం రోడ్డును తవ్వేసి వదిలేయడంతో మరో ఆర్టీసీ బస్సు గుంతలో పడింది. ఆ ఘటన మరువకముందే, ఇటీవల ఆగస్టు 22న రోడ్డు పనులు ప్రారంభించిన ఖమ్మంపల్లి-మునిపల్లి రోడ్డును తవ్వేయడంతో కంకర తేలి ఈ ప్రమాదం జరిగిందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తవ్విన రోడ్ల పనులను వెంటనే ప్రారంభించి, ప్రమాదాలు జరగకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

మెదక్ అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ. 2 వేల జరిమానా విధిస్తూ మెదక్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి నీలిమ బుధవారం తీర్పునిచ్చినట్లు అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. గతేడాది నవంబర్‌లో గోసిక విజయ్, విలియమ్స్‌తోపాటు మరో స్నేహితుడి మెదక్ పట్టణంలోని గాంధీనగర్ వచ్చారు ఈ సమయంలో తన కుమారుడు జైలుకు వెళ్లడానికి విజయ్ కారమణని విలియమ్స్ ఆరోపిస్తూ.. వాగ్వాదానికి దిగారు. నిన్ను చంపుతానని విజయ్‌ను బెదిరించాడు. ఆవేశంతో విలియమ్స్ తలపై విజయ్ కొట్టి హత్య చేశాడు. ఈ ఘటపై కేసు నమోదు చేసుకున్న అప్పటి పట్టణ సీఐ నాగరాజు సమగ్ర విచారణ జరిపి సాక్ష్యా ధారానుల సేకరించారు. ప్రస్తుత ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ మహేష్ సాక్షులను ప్రవేశ పెట్టి పూర్తి సాక్ష్యాధారానుల సమర్పించారు. విచారణ అనంతరం నిందితుడు విజయ్‌కు జీవిత ఖైదుతోపాటు రూ. 2 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి నీలిమ తీర్పుఇచ్చారు.

నీటి కుంటలో పడి యువకుడి మృతి



చంద్రపాల్ మృతదేహం

జిన్నారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి యువకుడు మరణించిన ఘటన గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కిష్టయ్యపల్లిలో చోటు చేసుకుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన చంద్రపాల్ (25) ఉపాధి కోసం వచ్చి కిష్టయ్యపల్లి నివాసం ఉంటూ ఓ వాటర్ ప్లాంట్ లో పని చేస్తున్నాడు. బుధవారం కిష్టయ్యపల్లి గ్రామ శివారులోని ఓ నీటి కుంటలో పడి అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఔట్‌సోర్సింగ్ అక్రమాలకు

ఆధార్‌తో చెక్

- ఉద్యోగుల ఆధార్ అనుసంధానానికి చర్యలు
- ఆధార్ ఇవ్వనివారికి ఈ నెల జీతాలు బంద్
- ఆగమేఘాలపై వివరాలు సేకరిస్తున్న ఏజెన్సీలు
- ఉమ్మడి జిల్లాలో 14900 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు



సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఔట్‌సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న ఉద్యోగులందరి వివరాలను తప్పనిసరిగా ఆధార్ కార్డుతో అనుసంధానించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆధార్ వివరాలు నమోదు చేయని వారికి ఈ నెల వేతనాలు నిలిపివేయనున్నట్లు ప్రభుత్వం చెప్పడంతో, ఏజెన్సీలు హడావుడిగా ఉద్యోగుల నుంచి వివరాలు సేకరిస్తున్నాయి.

అక్రమాలకు అడ్డుకట్ట

ఉద్యోగులను నియమించకుండానే రికార్డుల్లో చూపించి, లేని ఉద్యోగుల పేరిట వేతనాలు కాజేస్తున్నారనే ఆరోపణలు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై ఉన్నాయి. ఇటీవల సచివాలయంలో జరిగిన తనిఖీల్లో ఇలాంటి అక్రమాలు వెలుగులోకి రావడంతో, ప్రభుత్వం ఈ కఠిన చర్య తీసుకుంది. ఆధార్ అనుసంధానం ద్వారా రికార్డుల్లో ఉన్న ఉద్యోగులు వాస్తవంగా పనిచేస్తున్నారో లేదో తెలుసుకోవచ్చు, తద్వారా బోగస్ పేర్ల మీద జీతాలు తీసుకోవడం నిలిచిపోతుంది.

వివరాల నమోదులో ఏజెన్సీల నిర్లక్ష్యం

మెదక్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులు 8 వేల మంది, పెన్షనర్లు 3,300 మంది ఉన్నారు. ఆధార్ నంబర్ అనుసంధానం చేయని ఉద్యోగుల వేతనాలు నిలిపివేయాలని రాష్ట్ర ఖజానా డైరెక్టరేట్‌కు ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేయడంతో ఇప్పటికే వారంతా తమ వివరాలను సమగ్ర ఆర్థిక నిర్వహణ సమాచార వ్యవస్థ(ఐఎఫ్ఎంఐఎస్)లో అప్‌లోడ్ చేసుకున్నారు. కానీ మెదక్ జిల్లావ్యాప్తంగా పలు శాఖలలో పనిచేస్తున్న 10వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మాత్రం ఎలాంటి వివరాలు అప్‌లోడ్ చేసుకోలేదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాల నమోదులో ఏజెన్సీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ట్రెజరీ అధికారులు చెబుతున్నారు. కనీసం ఆధార్ నంబర్ కూడా లింక్ చేయలేదని తెలిపారు. ఇదే అదునుగా ఏజెన్సీలు అక్రమంగా జీతాలు డ్రా చేస్తున్నాయనే ఆరోపణలున్నాయి. దీనికి చెక్ పెట్టేందుకు ఆధార్ అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఈ నెల 25 వరకు ఆధార్ వివరాలు నమోదు చేసుకోవాలని ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఉమ్మడి జిల్లాలో 14900 వేల మంది

ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో దాదాపు 14900 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో మెదక్ జిల్లాలో 10 వేల మంది, సిద్దిపేటలో 4 వేలు, సంగారెడ్డిలో 900 మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఐడీ కార్డు, సర్వీసు బుక్ వంటి ఆధారాలు ఉన్నప్పటికీ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎలాంటి గుర్తింపు లేదు. ఈ నేపథ్యంలో, ఆధార్ అనుసంధానం ద్వారా వారికి ఓ ప్రాథమిక గుర్తింపు లభించినట్లవుతుంది. అయితే, వివాహిత మహిళా ఉద్యోగులకు ఆధార్‌లో పేరు మార్పుల (పెళ్లికి ముందు, తర్వాత) కారణంగా చిన్నపాటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతానికి ఉన్న ఆధార్ వివరాలు సమర్పించాలని, తర్వాత అప్‌డేట్ చేసుకోవచ్చని ఏజెన్సీలు సూచిస్తున్నాయి.

నెలనెలా సమస్యలే

సిద్దిపేట జిల్లాలోని దాదాపు 40 ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. కనీస వేతన చట్టం ప్రకారం రూ.18 వేలు ఇవ్వాల్సి ఉన్నా, ఏజెన్సీలు కేవలం రూ.12 వేల నుంచి రూ.14 వేలు మాత్రమే ఇస్తూ, మిగతా మొత్తాన్ని నొక్కేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక, ఉద్యోగుల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ కోసం కట్ చేసిన డబ్బులను కూడా ఏజెన్సీలు సక్రమంగా చెల్లించడం లేదని తెలుస్తోంది. నిలదీస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తామనే బెదిరింపులు ఉండటంతో ఉద్యోగులు వెట్టిచాకిరీ చేస్తున్నారు.

ప్రభుత్వమే నేరుగా వేతనాలు ఇవ్వాలి

వేతనాల్లో ఏజెన్సీల అక్రమాలకు చెక్ పెట్టాలని, కార్పొరేషన్ ద్వారా లేదా ప్రభుత్వమే నేరుగా తమకు జీతాలు చెల్లించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

మల్కాపూర్ నర్సరీలో పనులు షురూ

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



నర్సరీని శుభ్రం చేసిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తూప్రాన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మల్కాపూర్ ఆదర్శ గ్రామంలోని నర్సరీలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'మొక్కలు నాటారు.. నిర్వహణ మరిచారు' అంటూ కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఎంపీడీవో శాలికా తేలు, ఎంపీవో సతీష్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులను సక్రమంగా నిర్వహించాలని, నర్సరీని బాగు చేయాలని హెచ్చరించారు. దీంతో నర్సరీలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు.

భగవద్గీత కంఠస్థ రాష్ట్ర స్థాయి పోటీలకు కల్హేర్ బాలుడు



ప్రణవ్‌కు మెరిట్ పత్రం అందజేస్తున్న స్వామి స్వరూపానంద

కల్హేర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చిన్మయా గీతా చాంటింగ్(కంఠస్థ) కాంపిటీషన్ పోటీల్లో భగవద్గీతలోని కొన్ని భాగాలను కంఠస్థంతో జపించి, కల్హేర్‌కు చెందిన కరణం ప్రణవ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కరణం అనంతరావు, నీలిమ దంపతుల కుమారుడైన ప్రణవ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 28న బేగంపేటలోని స్వామి చిన్మయానంద గురుకుల పాఠశాలలో నిర్వహించిన భగవద్గీత కంఠస్థ జపించే (చాంటింగ్) జిల్లా స్థాయి పోటీల్లో 169 మంది చిన్నారులు పాల్గొన్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రణవ్‌ను ప్రపంచ చిన్మయ మిషన్ ప్రముఖులు స్వామి స్వరూపానంద, చిన్మయానందలు మెరిట్ పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర స్థాయి పోటీలు నవంబరు 9న ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ కడప జిల్లా కేంద్రంలో జరగనున్నాయి. చిన్న వయసులోనే ప్రణవ్ భగవద్గీతను కంఠస్థం చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై కల్హేర్ ప్రజలు అభినందించారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు బండి సంజయ్ పరామర్శ



రామచంద్రాపురం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు స్వర్గస్థులైన విషయం తెలిసిందే. దీంతో బుధవారం హరీశ్‌రావును పలువురు పరామర్శించారు. కేంద్ర మంత్రి బండిసంజయ్‌తో కలిసి ఎమ్మెల్సీ అంజిరెడ్డి హరీశ్‌రావు నివాసానికి వెళ్లి పరామర్శించారు. సత్తనారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మాజీ మంత్రి హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి బండిసంజయ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

వన్యప్రాణుల గణనపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న రామాయంపేట రేంజ్ ఆఫీసర్ విద్యాసాగర్

చేగుంట , అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల గణన ప్రక్రియ ద్వారా అడవుల్లో జీవ వైవిధ్యంపై విలువైన సమాచారం లభిస్తుందని రామాయంపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విద్యాసాగర్ రావు పేర్కొన్నారు. బుధవారం వల్లూరు సెంటర్ ఫారెస్ట్ నర్సరీలో రామాయంపేట రేంజ్ ఆఫీసర్ విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన జాతీయ వన్యప్రాణుల గణన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు డిసెంబర్‌లో వారం రోజులపాటు వన్య ప్రాణుల గణనా ఉంటుందన్నారు. మూడు రోజులపాటు శాకాహార వన్యప్రాణులు, మూడు రోజులపాటు మాంసాహార వన్యప్రాణులపై గణన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ప్రాంతంలో వన్యప్రాణుల సంఖ్య వాటి కదలికలు నివాస స్థలాల వివరాలను నమోదు చేయడం ఎంతో ముఖ్యమని వివరించారు. సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సాంకేతిక పద్ధతులతో లెక్కింపు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తూప్రాన్ రేంజ్ ఆఫీసర్ అంబర్ సింగ్, టైగర్ కన్జర్వేషన్ సొసైటీ ప్రతినిధి బాపు రెడ్డి, మెదక్ డివిజన్ ఫారెస్ట్ రేంజ్ అధికారులు, రామాయంపేట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గీత, సెక్షన్ ఆఫీసర్లు , బీట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




గోల్డ్‌మెడల్ అందుకున్న శ్రీహరి

సిద్దిపేట జిల్లావాసికి గోల్డ్ మెడల్

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన గూడెపల్లి శ్రీహరి రాజస్థాన్ గవర్నర్ హరిభాను బగాడే చేతులమీదుగా రెండు బంగారు పతకాలు అందుకున్నాడు. రాజస్థాన్ ఉదయపూర్‌లోని ఇంజనీరింగ్ కళశాలలో చదువుతున్న శ్రీహరి అకాడమిక్ ఇయర్‌లో కాలేజీ టాపర్‌గా నిలిచాడు. ఈ నేపథ్యంలో ఇంజనీరింగ్‌లో రెండు గోల్డ్ మెడల్స్ సాధించాడు. ఈ సందర్బంగా నిర్వహించిన కాన్వకేషన్‌లో గవర్నర్ హరిభాను బగాడే గోల్డ్ మెడల్స్ అందజేసి అభినందించారు.

సింగూరు ప్రాజెక్టుకు వరద

● ఒక క్రస్ట్‌గేట్ ఎత్తి దిగువకు విడుదల



క్రస్ట్‌గేట్ ద్వారా వరద జలాలు విడుదలవుతున్న దృశ్యం

పుల్‌కల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం వచ్చి చేరుతున్నది. పక్షం రోజుల క్రితం వరకు పది గేట్ల వరకు ఎత్తి వరద నీటిని దిగువకు వదిలిన విషయం తెలిసిందే. బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ కారణంగా మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పక్షం రోజుల అనంతరం సింగూరు ప్రాజెక్టులోకి మళ్లీ వరద ప్రవాహం వస్తున్నది. ప్రాజెక్టుకు ఎగువన సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాల్లోని మంజీర నది క్యాచ్‌మెంట్ ఏరియాల్లో కురిసిన వర్షానికి పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతున్నది. బుధవారం సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 11, 877 క్యూసెక్కులు నమోదైంది. దీంతో నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు 14వ క్రస్ట్‌గేట్‌ను రెండు మీటర్లు ఎత్తి 9,649 క్యూసెక్కుల వరదను దిగువన ఉన్న మంజీర జలాశయానికి వదులుతున్నారు. జల విద్యుత్ ఉత్పత్తి గేట్ ద్వారా 2,433 క్యూసెక్కులు మొత్తం ఔట్ ఫ్లో 12,082 క్యూసెక్కులుగా నమోదైంది. ఇదిలావుండగా, జిల్లా కేంద్రమైన సంగారెడ్డి సమీపంలోని మంజీర జలాశయం ఒక క్రస్ట్‌గేట్‌ను రెండు మీటర్లు, స్కవర్ గేట్ ఒకటి మీటరున్నర ఎత్తి వచ్చిన వరదను వచ్చినట్లుగానే ఘనపురం ప్రాజెక్టుకు వదులుతున్నారు.

జీవితంలో క్రీడలది కీలక భూమిక

● ప్రొఫెసర్ చిన్నప్పరెడ్డి



మాట్లాడుతున్న చిన్నప్పరెడ్డి

పటాన్‌చెరు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒకరి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో, సృజనాత్మకతను, శ్రేయస్సును పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని వరల్డ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అలయన్స్ బోర్డు డైరెక్టర్, గ్లోబల్ కమ్యూనిటీ హెల్త్ టెక్నికల్ హెడ్ ప్రొఫెసర్ చిన్నప్పరెడ్డి అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్పోర్ట్స్ డైరెక్టరేట్, గస్టో 2025-26 పేరిట నిర్వహిస్తున్న మూడు రోజుల అంతర్-విశ్వవిద్యాలయ, అంతర్-కళాశాల క్రీడా పోటీలను బుధవారం ఆయన జ్యోతి ప్రజ్వలనతో లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు తమ ఆసక్తి, అభిరుచికి అనుగుణంగా ఎంపిక చేసుకుని, జీవితాన్ని కొనసాగించాలన్నారు.

జాతీయ సదస్సు ప్రారంభం

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మూడు రోజుల ద్విభాషా జాతీయ సదస్సును బుధవారం వేగా కన్వేయర్స్ అండ్ ఆటోమేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ గరిమెళ్ల ప్రారంభించారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ)లోని భారతీయ భాషాభివృద్ధి, పోషణకు మద్దతు పథకం సౌజన్యంతో దీనిని ఏర్పాటు చేశారు.

ప్రపంచ కూటమిలో ఐఐటీహెచ్

కంది, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సోలార్ ప్యానెల్ రీసైక్లింగ్ కోసం జీరో-కార్బన్ సిలికాన్ రిఫైనింగ్ లక్ష్యంగా గ్లోబల్ కన్సార్టియం (ప్రపంచ కూటమి)లో సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ చేరింది. మేక్ ఇన్ ఇండియా, క్లీన్ ఎనర్జీ, సర్క్యులర్ ఎకానమీ కోసం ఈ ఉన్నత కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ భాగస్వామ్యం అయింది. ఈ మేరకు ఐఐటీహెచ్ అధికారులు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సౌర సంస్థాపనల నేపథ్యంలో సిలికాన్ రికవరీ, వనరుల సర్క్యులారిటీ, క్లీనర్ ఎనర్జీలు కీలకంగా మారనున్నాయి. జీవితాంతం ఉపయోగించలేని సౌర ఫలకాలను రీసైక్లింగ్ చేయడం లక్ష్యంగా సిలికాన్ రిఫైనింగ్ టెక్నాలజీలను అభివృద్ధి చేయడానికి ఐఐటీహెచ్ ఆస్ట్రేలియాలోని స్విన్‌బర్న్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ నేతృత్వంలోని గ్లోబల్ కన్సార్టియంలో చేరింది. భారతదేశం, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, యూఏఈ నుంచి అధిక స్వచ్ఛత సిలికాన్‌ను తిరిగి పొందడానికి ఆకుపచ్చ, వృత్తాకార విధానాలను అభివృద్ధి చేస్తుంది. ఇందు కోసం 3 మిలియన్ల డాలర్లను ఈ ప్రాజెక్ట్ కోసం ఆస్ట్రేలియన్ ప్రభుత్వం నిధులు సమకూరుస్తుంది. ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ ఈ సహకారం ద్వారా భారతదేశంలో పెరుగుతున్న క్లీన్ ఎనర్జీ ఎకోసిస్టమ్‌కు సౌర రీసైక్లింగ్‌ను ఆచరణాత్మకంగా ప్రభావవంతంగా చేసే సమర్థవంతమైన, స్కేలబుల్ రిఫైనింగ్ పద్ధతులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

అర్బన్ పార్కుకు హైటెక్ హంగులు



త్వరలో అందుబాటులో రానున్న నీటిలో నిర్మించిన అధునాతన సదుపాయల కాటేజీలు

- నర్సాపూర్ ఫారెస్ట్‌లో ఏర్పాటు
- నీటి మధ్యలో 40 కాటేజీల నిర్మాణం
- త్వరలో పర్యాటకులకు అందుబాటులోకి
- నీటిలో తేలియాడుతున్న అనుభూతినిచ్చేలా నిర్మాణం


నర్సాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌కు కేవలం 50 కిలోమీటర్ల దూరంలో, జాతీయ రహదారి పక్కనే ఉన్న నర్సాపూర్ అర్బన్ పార్కు పర్యావరణ ప్రేమికులకు, పట్టణ వాసులకు ఆహ్లాదకరమైన ఆటవిడుపు కేంద్రంగా మారింది. సహజసిద్ధమైన అడవిలో ఏర్పాటు చేసిన ఈ పార్కులో ఇప్పటికే పచ్చని చెట్లను చూస్తూ నడవడానికి వీలైన సుమారు రెండు కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్ ఉంది. అలాగే, ఎత్తైన ప్రాంతంలో నిర్మించిన వాచ్ టవర్ పార్కుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దీనిపై నుంచి చుట్టూ ఉన్న అటవీ ప్రాంతాన్ని, నర్సాపూర్ పట్టణాన్ని వీక్షించవచ్చు. సెలవు దినాలలో హైదరాబాద్ నుంచే పెద్ద సంఖ్యలో పర్యాటకులు ఇక్కడికి వస్తున్నారు.



కాటేజీల సమీపంలోనే పర్యాటకుల కోసం స్విమ్మింగుపూలు

హైటెక్ కాటేజీలు త్వరలో ప్రారంభం

పర్యాటకుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో, అర్బన్ పార్కుకు మరింత ఆకర్షణను జోడిస్తూ, పార్కుకు సమీపంలో ఉన్న రాయరావు చెరువు పక్కన హైటెక్ తరహాలో అన్ని వసతులతో 40 కాటేజీలు నిర్మించారు. త్వరలో ఇవి అందుబాటులోకి రానున్నాయి. వీటిని నీటి మధ్యలో నిర్మించడంతో పర్యాటకులు లోపల సేద తీరినప్పుడు నీటిలో తేలియాడుతున్న అనుభూతిని పొందవచ్చు. కాటేజీల వద్దే పర్యాటకుల కోసం స్విమ్మింగ్ పూల్, బ్యాంక్వెట్ హాళ్లతో పాటు రెస్టారెంట్ కూడా ఏర్పాటు చేయనున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే, పర్యాటకులు పార్కులో తిరిగి, కాటేజీలలో ఉండి, అక్కడే రుచికరమైన భోజనాన్ని ఆస్వాదించవచ్చు. దీంతో నర్సాపూర్ అటవీ ప్రాంతం పర్యాటక పరంగా మరింత ప్రసిద్ధి చెందడం ఖాయం .



అర్బన్‌పార్కులోని వాచ్‌టవర్

విజిలెన్స్ అవగాహన కార్యక్రమం

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వారోత్సవాలలో భాగంగా, రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శృతికీర్తి ఆధ్వర్యంలో అధికారుల బృందం బుధవారం నర్సాపూర్ అర్బన్ పార్కును సందర్శించింది. ఈ సందర్భంగా అధికారులు పార్కులో మొక్కలు నాటారు. అంతేకాక, నర్సాపూర్ డిగ్రీ కళాశాల విద్యార్థుల చేత విజిలెన్స్ అవగాహన ప్రతిజ్ఞ కూడా చేయించారు.

హరిత రెస్టారెంట్‌ను వినియోగంలోకి తెస్తాం

● పరిశీలించి పర్యాటక శాఖ డిప్యూటీ కలెక్టర్ రామ్మూర్తి



కోహీర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా, కోహీర్ మండలంలోని కవెల్లి చౌరస్తా వద్ద గత కొన్ని రోజులుగా మూతపడి నిరుపయోగంగా ఉన్న హరిత రెస్టారెంట్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టనున్నట్లు పర్యాటక శాఖ డిప్యూటీ కలెక్టర్ రామ్మూర్తి తెలిపారు. పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశాల మేరకు ఆయన ఈ రెస్టారెంట్‌ను పరిశీలించారు. రాష్ట్రంలో మొత్తం 28 హరిత రెస్టారెంట్లు ఉన్నాయని, వాటిలో అవసరం ఉన్న ప్రాంతాల్లోని రెస్టారెంట్లను పర్యాటకులను దృష్టిలో ఉంచుకొని మరింత మెరుగు పరుస్తున్నట్లు తెలిపారు. మూతపడిన రెస్టారెంట్లను గుర్తించి, అవసరం ఉన్నచోట వాటిని తిరిగి పునఃప్రారంభించడానికి కృషి చేస్తామని, అవసరమైతే కొన్ని చోట్ల బార్లను ఏర్పాటు చేసే ఆలోచన కూడా ప్రభుత్వం చేస్తుందని ఆయన తెలిపారు. కవెల్లి రెస్టారెంట్‌ను పునఃప్రారంభించాలా లేదా అనే అంశంపై మరోసారి పరిశీలన చేసి నిర్ణయం వెల్లడిస్తామని పేర్కొన్నారు.

సుప్రీం జడ్జిపై దాడి చేసినా కేసు ఏదీ?

- ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు మైస రాములు, ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు కృష్ణ

గజ్వేల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టీస్ గవాయిపై దాడి విషయంలో కేసు నమోదు చేయకపోవడం సరికాదని ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు మైస రాములు, ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు కృష్ణ ప్రశ్నించారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఈ విషయమై ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉబ్బని ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగే మహేశ్‌లతో కలసి మాట్లాడుతూ.. దేశ రాజధానిలో, అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడి జరిగితే ఇంకా కేసులు ఎందుకు నమోదు కాలేదని, ప్రశ్నించారు. దళితుడైన చీఫ్ జస్టీస్‌కే రక్షణ లేకపోతే సాధారణ ప్రజలకు రక్షణ ఎలా అని, 20రోజులు గడుస్తున్నా ఇప్పటికి కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. నవంబరు 1న బాబుజగ్జీవన్‌రాం విగ్రహం నుంచి సెక్రటేరియట్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వరకు దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శన మహార్యాలీ జరుతుందని, ఈ ర్యాలీకి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి ప్రజలు తరలిరావాలని కోరారు.


గజ్వేల్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

- కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్

సిద్దిపేట అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటను ప్రతి గింజను కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ తెలిపారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించిన ఆయన ధాన్యం కొనుగోలుపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అత్తుఇమామ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతుల సంక్షేమ ప్రభుత్వమని, సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అన్నారు. రెండు రోజుల్లో ఐరీస్, బయోమెట్రిక్ నిబంధనను తొలగించాలని దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వంపై బురదజల్లేందుకు కొందరు బీఆర్ఎస్ నాయకులు రైతులను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గయాజుద్దీన్, అర్షద్, బాబా తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడుతున్న అత్తుఇమామ్


మద్రాస్ ఐఐటీ సర్టిఫికెట్లతో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం

విద్యార్థులకు ఐఐటీ సర్టిఫికెట్లు

- ప్రధానోపాధ్యాయుడు షౌకత్ అలీ

సిద్దిపేట రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): డాటా ఎనాలసిస్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రాథమిక భవనాల పై ఐఐటీ మద్రాస్‌లో ఎనిమిది వారాల కోర్సు పూర్తి చేసి సర్టిఫికెట్లు పొందినట్లు నారాయణరావుపేట మండలం జక్కాపూర్ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షౌకత్ అలీ బుధవారంతెలిపారు. ఈ సందర్భంగా షౌకత్ అలీ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో 13 మంది విద్యార్థులు కోర్సును విజయవంతంగా పూర్తి చేశారన్నారు. 11 మంది విద్యర్థులు సంబంధిత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారని, ఇద్దరు విద్యార్థులు భాగస్వామ్య సర్టిఫికెట్లు పొందారని తెలిపారు. పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ఈ కోర్సులో ఎప్పటికప్పుడు ముందుకు వెళ్లేలా ప్రోత్సహించిన సీనియర్ ఉపాధ్యాయురాలు కోమ్మురి పద్మ, గైడ్ టీచర్ ఫిసికల్ సైన్స్ రాచకోండ రాజేందర్ లను ఉపాధ్యాయ బృందం అభినందించారు. మద్రాస్ ఐఐటీ నుంచి ఆన్‌లైన్‌లో విడుదల చేసిన సర్టిఫికెట్లను విద్యార్థులకు అందజేశారు.

గోతిలోపడి ఒకరికి గాయాలు

చేర్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాంధీ చౌక్ సమీపంలోని వైన్‌షాప్ ఆవరణలో అసంపూర్తి డ్రైన్‌కాలువ గోతిలోపడి ఓ కూలీ గాయాల పాలయ్యాడు. బుధవారం పట్టణంలో వర్షం కురవడంతో గాంధీచౌక్ ఆవరణలో వరదనీరుచేరి సమీప ప్రాంతమంతా జలమయమైంది. వైన్‌షాప్ సమీపంలో అసంపూర్తి డ్రైన్‌కాలువ గోతి వరకు వరదనీటిప్రవాహం కొనసాగింది. నీటిలో నడుచుకుంటూ వెళ్తున్న కూలీ ప్రమాదవశాత్తు గోతిలో పడిపోయాడు. గమనించిన చుట్టుపక్కలవారు కూలీని బయటకు లాగడంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. గాంధీచౌక్ వద్ద కల్వర్టు పనులు కొనసాగుతుండగా, డ్రైన్ కాలువను అర్ధాంతరంగా నిలిపివేశారు. తీసిన గోతి ప్రదేశంలో ఎలాంటి హెచ్చరికబోర్డు ఏర్పాటు చేయకపోవడం,వరదనీటి కారణంగా కనిపించడకపోవడంతో ప్రమాదానికి కారణమైంది. ఈవిషయమై స్థానికులు ఎన్‌హెచ్ అధికారులతో పాటుమునిసిపల్ అధికారుల నిర్లక్ష్య ం ట్ల మండిపడ్డారు. ఇదిలా ఉండగా, కడవేరుగు దారిగుండా వరదనీటి ప్రవాహం ఉధృతమై గాంధీచౌక్, యూనియన్ బ్యాంకుఏరియా వద్ద మోకాలిలోతు నీరు నిలవడంతో వాహనాలు నిలిచిపోయాయి.ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు.

వర్షాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలి

రాయపోల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని రాయపోల్ మండల ఏవో నరేష్, అనాజీపూర్ ఏఈవో అశ్లేష అన్నారు. వచ్చే రెండు మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో పాటు ఉన్నతాధికారులు హెచ్చరించిన నేపథ్యంలో రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని ఏవో నరేష్, అనాజీపూర్ ఏఈవో అశ్లేష పేర్కొన్నారు. ఇది వరకే పంట కోతలు పూర్తి చేసిన రైతులు ఆరబెట్టిన పంటలపై టార్పాలిన్ కవర్లు కప్పుకోవాలని సూచించారు.

వణికిస్తున్న 'మొంథా'

(5వ పేజీ తరువాయి)

నమోదైంది. వాతావరణశాఖ అధికారులు సిద్దిపేట జిల్లాకు రెడ్ అలర్ట్‌ను జారీ చేశారు.

కొట్టుకుపోయిన ధాన్యం


తుఫాన్ కారణంగా పలుచోట్ల ధాన్యం తడిసిపోగా, పలు చోట్ల రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసి నీటిలో కొట్టుకుపోయింది. హుస్నాబాద్ మండలంలో పలు గ్రామాల్లో, తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లిలో రోడ్డుపై ఆరబెట్టిన మక్క, నారాయణరావుపేటలో ఐకేపీ కేంద్రానికి రైతులు తెచ్చిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. సిద్దిపేటలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో, కొమురవెల్లి మండలం కిష్టంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రంలో, సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు ఐకేపీ సెంటర్, గజ్వేల్ రూరల్ మండలంలో, చేర్యాల వ్యవసాయ మార్కెట్‌లో, చిన్నకోడూరు మండలంలో ధాన్యం వర్షానికి తడవకుండా రైతులు టార్పాలిన్ కవర్లను కప్పి ఉంచారు. పలుచోట్ల రైతులు విశ్వప్రయత్నాలు చేసినా కూడా ధాన్యం కొట్టుకుపోయింది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి పలు ప్రాంతాలు నీట మునిగాయి. జిల్లాలోని హుస్నాబాద్‌లో భారీ వర్షం కురియడంతో బస్టాండ్‌తో పాటు పలు ప్రధాన రహదారులు మోకాల్లోతు వరకు నీట మునిగాయి. వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చేర్యాల పట్టణంలోని గాంధీ రోడ్డుతో పాటు, కేపీఆర్ కాలనీలోని ఖాళీ స్థలాలోకి వర్షపు నీరు చేరి నిలిచిపోయింది. సిద్దిపేట అర్బన్ మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో దంచికొడుతున్న వర్షానికి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. హుస్నాబాద్ పట్టణంతో పాటు చిన్నకోడూరు తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షం వల్ల గంటల తరబడి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.


నంగునూరు మండలం గట్ల మల్యాల కొనుగోలు కేంద్రంలో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం


గజ్వేల్ మండలంలో రోడ్డుపై ధాన్యం తడవకుండా కప్పిన టార్పలిన్లు, సంచులు


మహ్మదాపూర్‌లో నేలవాలిన వరి చేను


చేర్యాల పట్టణంలోని బస్టాండు సమీప ఏరియాలో జనావాసాల నడుమ వరద నీటినిల్వ

వధువుకి పుస్తె, మెట్టెలు పంపిణీ

సిద్దిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గౌరారంలో బీఆర్ఎస్ నాయకులు వధువుకు పుస్తె, మెట్టలు పంపిణీ చేశారు. వర్గల్ మండలం గౌరారం గ్రామానికి చెందిన ఈరబోయిన సుజాత కూతురు శృతి వివాహానికి బుధవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఎల్కంటి మైపాల్‌రెడ్డి బంగారు పుస్తె, మెట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారెడ్డి మహిపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, లక్మారెడ్డి, నగరం కనకరాజు, భోంరెడ్డి మధుసూదన్ రెడ్డితో పాటు తదితరులు ఉన్నారు


గౌరారంలో వధువు శృతికి పుస్తె, మెట్టలు పంపిణీ చేస్తున్న స్థానిక నాయకులు

జీవాల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

- ఉచితంగా పశువులకు గాలికుంటు నివారణ టీకాలు పంపిణీ
- ఊరూరా కొనసాగుతున్న వ్యాక్సినేషన్

దౌల్తాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు జీవాల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పశు వైద్య సిబ్బంది శిల్ప అన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని గొడుగు పల్లి గ్రామంలో పశువులకు గాలి కొంటూ నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు మద్దెల స్వామి మాట్లాడుతూ.

ప్రభుత్వం ముందు చూపుతోనే పశువులకు, గొర్రెలకు, మేకలకు, గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ శివకుమార్, నాయకులు బాబు, దుర్గ నరసింహులు, నరేష్, అబ్బు, రైతులు పెద్దలు పాల్గొన్నారు


దౌల్తాబాద్ : గొడుగుపల్లిలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది, నాయకులు

రెవెన్యూ లీలలు

(5వ పేజీ తరువాయి)

దృష్టికి తీసుకెళ్లినా, మొక్కుబడిగా పరిశీలించి వదిలేస్తున్నారు. మట్టి తరలింపుపై రెవెన్యూ అధికారుల తీరు నిమ్మకు నీరెత్తినట్టుగా ఉంది. అక్రమంగా మట్టి తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ రూ.కోట్లలో సంపాదిస్తున్న వారిపై చర్యలు ఎప్పుడు తీసుకుంటారో చూడాలి.

బ్రిడ్జి కోసం భూమి ఇస్తే మాకే దారి ఇవ్వడం లేదు

రైల్వే బ్రిడ్జి నిర్మాణం కోసం 27 గుంటల భూమిని కోల్పోయా. ఇక మిగిలిన వ్యవసాయ భూమిలోకి వెళ్లడానికి దారి సమస్య ఉంది. ఆ సమస్యను పరిష్కరించాలని ఎనిమిది నెలలుగా ఎమ్మార్వో కార్యాలయంలో చుట్టూ తిరుగుతున్నా. ఆర్డీవో, కలెక్టర్, ఎంపీ రఘునందన్‌రావుకు మొరపెట్టుకున్నా. స్పందించిన వారు మండల రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చినప్పటికీ దారి సమస్య పరిష్కారం కాలేదు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

- కంకణాల రాజు, రైతు లకుడారం

ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఎంఏ జలీల్


వర్గల్ మండల ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, సభ్యులుగా నియామకమైన విశ్రాంతి ఉద్యోగులు

సిద్దిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఎంఏ జలీల్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. బుధవారం వర్గల్ కేంద్రలోని ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం భవణంలో ఎన్నికల అధికారిగా విశ్రాంతి ఉద్యోగుల జిల్లా సంఘం అధ్యక్షుడు ఏ చంద్రరెడ్డి పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. వర్గల్ మండల సంఘం అధ్యక్షుడిగా ఎంఏ జలీల్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ఆయనకు నియామక పత్రం అందజేశారు. మండల సంఘం ఉపాధ్యాక్షులుగా నూక లింగమూర్తి, స్వయంప్రభ, ప్రధాన కార్యదర్శిగా దశరథం, కోశాధికారిగా ఉప్పరి గోపాల్, అసోసియెట్ అధ్యక్షులుగా పండరి, సెక్రటరిలుగా అల్లాఉద్దిన్, జయప్రకాశ, శంకరమ్మలు నియామకమైనారు. సంఘం అధ్యక్షులుగా మరో సారి సభ్యులు తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల అధ్యక్షులుగా ఎన్నికైన జలీల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. విశ్రాంతి ఉద్యోగుల సమస్యల పరిష్కరం కోసం కృషి చేస్తామని జలీల్ అన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు


వడ్ల కోనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీటీసీ అంజయ్య యాదవ్

గజ్వేల్ రూరల్ ఆక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రైతులు దళాలను నమ్మి మోసపోవద్దు అని మాజీ ఎంపీటీసీ అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కొడకండ్ల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినా వడ్ల కోనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్ల కోనుగోలన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి అని అన్నారు.

చౌటకూర్‌లో ధన్వంతరి నారాయణ జయంతి

పుల్‌కల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చౌటకూర్‌లో ధన్వంతరి నారాయణ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాయి బ్రహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిళ్ల నాగభూషణం హాజరయ్యారు. అంతకుముందు సమావేశమైన నాయి బ్రహ్మణులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజా ప్రతినిధులను కలిసి ప్రభుత్వానికి విన్నవించాలని తీర్మానించారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం


జూబ్లీహిల్స్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న గజ్వేల్ కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉప ఎన్నికల నేపథ్యంలో గజ్వేల్ నియోజకవర్గ నాయకులు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటి ప్రచారంలో నిమగ్నమయ్యారు. మహాత్మానగర్‌లో ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌ల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు. వారితో నాయకులు చిట్కుల శివారెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్, భాస్కర్‌గౌడ్, నక్క రాములు గౌడ్, శశివర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

అంగడికిష్టాపూర్ పాఠశాలను సందర్శించిన ఎంఈవో

మర్కుక్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అంగడికిష్టాపూర్‌ను స్వచ్ఛ విద్యాలయ పురస్కార విభాగంలో భాగంగా జగదేవ్‌పూర్ ఎంఈవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అత్యధికంగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో 220 మందికి పైగా చదువుకోవడం, పాఠశాల అన్ని రంగాల్లో ముందు ఉండడం, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, తరగతి గది నిర్వహణ, ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ, ఉపాధ్యాయుల నిబద్ధత జిల్లాలోని ఉత్తమ పాఠశాలగా అంగడికిష్టాపూర్ నిలుస్తుందని అన్నారు. పాఠశాల ఉన్నతిని నిలబెడుతున్న ప్రధానోపాధ్యాయులు బాలకిషన్, ఉపాధ్యాయులను, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అన్ని హంగులతో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అంగడికిష్టాపూర్ అద్భుతంగా నడుస్తుందని జగదేవ్‌పూర్ మండల విద్యాధికారి సైదులు అన్నారు.

అక్బర్‌పేట-భూంపల్లి ఎంపీడీవోగా సోమిరెడ్డి

సిద్దిపేట అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండల ఎంపీడీవోగా సోమిరెడ్డి బుధవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో విధులు నిర్వర్తించిన జహిరోద్దిన్ బదిలీపై వెళ్లారు. ఎంపీడీవోగా బాధ్యతలను చేపట్టిన సోమిరెడ్డిని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శాలువతో సన్మానించారు. ఆయన వెంట జన్నారెడ్డి, చంద్రసాగర్, దయాకర్‌రెడ్డి, మల్లేశం, మురళి తదితరులున్నారు.


ఎంపీడీఓగా బాధ్యతలను స్వీకరించిన సోమిరెడ్డిని సన్మానిస్తున్న రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య